# బారి

రెస్టారెంటులో నేనూ, లలిత ఒక మూల కిటికీ పక్కన ఎదురెదురుగా కూర్చున్నాం. సమయం రాత్రి ఎనిమిదీ పదయింది. చుట్టూ ఉన్న గాలి చల్లగా ఉంది. అక్కడి నుండి చూస్తుంటే ఊరు చాలామటుకు కనిపిస్తోంది. అక్కడ ప్రైవసీ ఉంటుంది. వంటకాలు రుచిగా ఉంటాయి. ఎంతసేపయినా ఆ రివాల్వింగ్ రెస్టారెంట్‌లో కూర్చోవాలనిపిస్తుంటుంది. లలిత ఆహ్వానం మేర అక్కడకు చాలా కాలం తర్వాత వచ్చాను. కాని ఏం మాట్లాడాలో తోచటం లేదు. మునుపయితే అక్కడే కూర్చుని గంటల తరబడి మాట్లాడుకునేవాళ్లం.

లలితను చూసి అయిదు సంవత్సరాలు దాటాయి. ఈ అయిదు సంవత్సరాల్లో లలితలో ఏ మార్పు కనిపించటంలేదు. మునుపటికన్నా చక్కగా ఉంది. లలితకు నలభై సంవత్సరాల వయసుంటుందని ఎవరూ అనుకోరు. చూడటానికి ఏ ముప్పై సంవత్సరాల వయస్కురాలిలానో కనిపిస్తుంది. అందంగా అలంకరించుకోవటం ఆమెకు బాగా తెలుసు.

"చెప్పు. ఏం తీసుకుంటావు?" అడిగింది.

సిగరెట్ వెలిగించాను. మెనూ కార్డు చూస్తూ నాకు కావలసినవి చెప్తుంటే స్టివార్డ్ రాసుకున్నాడు. లలిత తనకు కావలసినవి చెప్పింది. స్టివార్డ్ వెళ్లిపోయాక నా ముఖంలోకి పరీక్షగా చూసి, "సిగరెట్లు తాగటం ఎప్పటి నుండి మొదలు పెట్టావు?" అడిగింది.

"చాలా కాలమయింది."

"ఈ అయిదు సంవత్సరాలలో నేనెప్పుడూ నీకు గుర్తు రాలేదా?"

నవ్వి, "వచ్చావు. చాలాసార్లు గుర్తు వచ్చావు" అన్నాను.

"నన్ను కలవాలని అనిపించలేదా?"

"అనిపించింది."

"మా ఇల్లు నీకు తెలుసుకదా, వచ్చి ఉండాల్సింది."

"వద్దామని చాలాసార్లు అనుకున్నాను కాని రాలేకపోయాను. నాన్నగారు పోయాక మా కంపెనీ బాధ్యతలు నామీద పడటంతో తీరిక చిక్కేది కాదు. సమయం అంతా కంపెనీలోనే గడిచిపోయేది. పదకొండు దాటాక కాని ఇంటికి వెళ్లలేకపోయేవాడిని."

"ఒకసారెప్పుడో, ఇంగ్లీషు దినపత్రికలో అనుకుంటాను, మీ కంపెనీ గురించి చదివాను. నీ కలర్ ఫోటోకూడా వేశారు. కంపెనీని బాగా అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకున్నావు".

"చెప్పు. నువ్వెలా ఉన్నావు? పిల్లలెంతమంది?"

లలిత నా కళ్లల్లోకి చూస్తూ మంచినీళ్ల గ్లాసు చేతిలోకి తీసుకుంది. కొద్దిగా నీళ్లు తాగి పక్కగా పెట్టి చేతిరుమాలుతో పెదాలపైన తడి అద్దుకొని, "నేనేం బాగా లేను" అంది.

"చూడటానికి మునుపటి కన్నా చక్కగా ఉన్నావు."

లలిత పొగడ్తలకు ఇష్టపడుతుంది.

"ఒక బాబు పుట్టి చనిపోయాడు... ఆ తర్వాత పిల్లలు కలగలేదు...." అతి సామాన్య విషయంలా చెప్పింది.

"అయాం సారీ...." ఆమె ఎడం చేతిమీద నా చేయి వేసి చిన్నగా తడుతూ, "మీ ఆయన ఎలా ఉన్నారు?" అడిగాను. తన చేయి వెనక్కి తీసుకోలేదు. ఒకప్పుడు నాకెంతో ఇష్టమయిన చేతులవి. నా చేతుల్లోకి తీసుకుంటే వదలబుద్ధి అయ్యేది కాదు.

దీర్ఘంగా నిట్టూర్చి, "ఆయనకేం మహారాజులా ఉన్నాడు. ఈ ఊళ్లోనే అదే ఆఫీసులో పనిచేస్తున్నాడు. నన్ను వదిలేసి మరో పెళ్లి చేసుకుని నిక్షేపంలా ఉన్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలని విన్నాను. నన్ను వదిలి పెట్టేసి నాలుగు సంవత్సరాలు అయింది...." అంది. మాటల్లో ఏ విధమయిన బాధ నాకు కనిపించలేదు.

కొద్దిసేపు మౌనంగా ఉండి, "విడాకులు తీసుకున్నారా?" అడిగాను.

"నా ప్రవర్తన మంచిది కాదంటూ విడాకులకు దాఖలు చేశాడు. కోర్టు విడాకులు ఇవ్వలేదు. కేసు నడుస్తుండగా గుట్టుచప్పుడు కాకుండా మరో పెళ్లి చేసుకున్నాడు."

"అతనిమీద నువ్వు కేసు పెట్టి ఉండాల్సింది."

"ఆ ప్రయత్నమూ చేశాను. నాకు ఆధారాలు, సాక్ష్యాలు దొరకటం తేలిక అనిపించలేదు. లాయర్ల చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాను. అన్నీ వాయిదాలే...." తల అడ్డంగా ఆడించింది. "నా సంగతి వదిలేసేయి.... నీ భార్య, పిల్లలూ ఎలా ఉన్నారు." అడిగింది.

"వాళ్ల గురించి నాకూ తెలియదు" అన్నాను.

"అదేమిటి?"

బేరర్ చెప్పిన అయిటమ్స్ తెచ్చి బల్లమీద సర్దుతుంటే మౌనంగా ఉండిపోయాను. సిగరెట్ యాష్ ట్రేలో కుక్కి నేప్‌కిన్ అందుకుని లలిత ముఖంలోకి చూశాను. నా మాట నమ్మినట్టు అనిపించలేదు. సూప్ దగ్గిరకు లాక్కుంటూ, "నాకు ఆకలిగా ఉంది" అన్నాను. నా ప్రస్తుతం గురించి ఆమెతో ఎందుకు చెప్పాలి?

సూప్ వేడిగా ఉంది. కొద్దికొద్దిగా తీసుకుంటుంటే, "నేను జీవితంలో మోసపోయాను. నమ్మిన వాళ్ళు, నా అనుకున్న వాళ్లు, కట్టుకున్న భర్త అందరూ దగా చేశారు.... " ఎంతటి విషయాన్నయినా ఆవేశంగా అనదు. మొదటి నుండీ అంతే.

ఆగి కొద్దిసేపు మౌనంగా ఉండి..."నువ్వు చాలా మారిపోయావు" అంది.

"బట్టతల వచ్చింది."

ఎనిమిది సంవత్సరాల కిందట లలితతో నాకు పరిచయం అయింది. అయిన కొద్ది రోజులకే దగ్గిరయ్యాం. రెండు రోజుల కొకసారయినా ఆమెను చూడకుండా ఉండలేక పోయేవాడిని. ఆమెతో డీప్‌గా ఇన్‌వాల్వ్ అయిపోయాను. ఇంటినీ, కుటుంబాన్ని, ఉద్యోగాన్ని మర్చిపోయి లలితే నా సర్వస్వం అనుకున్నాను. ఆమె తోడుదే నా జీవితం అని భావించి ఆమె కోసం నేను చేయనిది లేదు. ఆమెకు ఏ విషయంలోనూ కొదవ చేయలేదు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టాను.

ఒకరోజు "నన్ను పెళ్లి చేసుకుంటావా?" సీరియస్‌గా అడిగింది. అంతకు ముందెప్పుడూ పెళ్లి ప్రస్తావన రాలేదు. ఆమె నాకంటె పది సంవత్సరాలు చిన్నది. కాలక్షేపానికి నాతో తిరుగుతోందని అనుకున్నాను, కాని నన్ను చేసుకోటానికి సిద్ధపడుతుందని అనుకోలేదు. ఆమెను చేసుకోవాలనే ఆలోచన అంతకు ముందు ఎప్పుడూ రాలేదు.

నేను జవాబు చెప్పే లోపల ఆమె అంది, "మన ఇద్దరి సంబంధం గురించి అటు మా ఆఫీసులోనూ, ఇటు మా ఇంట్లోను తెలిసింది."

"నా భార్యకు కూడా తెలుసు."

"ఏమన్నా అన్నదా?"

"నిజమేనా అని అడిగింది. నిజమే అన్నాను. అప్పటినుండి నాతో మాట్లాడటం మానేసింది."

"పిల్లలు?"

"వాళ్లు మాట్లాడుతుంటారు, మునుపంత ప్రేమతో కాదు."

"నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు."

"నాకు ఎటువంటి అభ్యంతరం లేదు." నెమ్మదిగా అన్నాను. నా కంఠస్వరం నాకే కొత్తగా ధ్వనించింది. ఆ మాట దాటేద్దామని అనుకున్నాను. వీలుకాలేదు.

"ఒక షరతు."

"చెప్పు."

"నీ భార్యకు విడాకులు ఇచ్చాకే మన పెళ్ళి."

ఆలోచనల్లో పడ్డాను. ఉన్నట్టుండి వాతావరణం మారిపోయింది. ఈ మార్పుకు తయారుగా లేను. తను నా భార్యనూ, పిల్లలను వదిలిపెట్టటం నా వలన కాదు. నాకు ఏమాత్రం ఇష్టం లేదు.

కొద్దిసేపు మౌనంగా నా ముఖంలోకి చూసి, "ఏమయిదేం, మాట్లాడవేమిటి?" అడిగింది .

"విడాకులకు సమయం పడుతుంది."

"అప్పటి వరకు ఆగుదాం. ఏం?" అంది.

కావాలనో ఏమో నెలా పదిహేను రోజులపాటు నన్ను కలవలేదు. ఫోనులో పొడిపొడిగా మాట్లాడేది. కొన్నిసార్లయితే సీట్లో లేదని ఎవరి చేతనో చెప్పించేది. నాకు బాధగా ఉండేది. క్షణక్షణం ఆమె ఆలోచనలే నన్ను ముసురుతుండేవి. ఆమె లేకుండా బతకలేనేమో అని గాఢంగా అనిపించి డిప్రెషన్‌కు లోనయ్యాను. ఆమెకు ఫోను చేయటం మానుకున్న తర్వాత ఆమే ఫోను చేసినప్పుడు, " నా భార్య నాకు విడాకులు ఇవ్వటానికి ఒప్పుకొంది. విడాకుల పేపర్ల మీద సంతకం చేసింది" అన్నాను.

లలిత వెంటనే ఏం మాట్లాడలేదు. కొద్దిసేపు మౌనం తర్వాత, "ఇద్దరం తొందరపడ్డామేమో?" నెమ్మదిగా అంది.

ఉలిక్కిపడ్డాను. ఆమె అన్నది సరిగా వినలేదేమో అనిపించి, "తొందరపడ్డామా?" అడిగాను.

చిన్నగా దగ్గి, "ఏమనుకోకు. నా మనసు మార్చుకున్నాను. కొద్దిగా ఆలస్యంగా చెప్తున్నందుకు నన్ను క్షమించు. నా మూలాన నీ కుటుంబం విచ్ఛిన్నం కావటం నాకు ఇష్టం లేదు. ఏదో తిరిగినంతకాలం తిరిగాం. అక్కడితో మర్చిపోదాం. అంతే. అది ఇద్దరికీ మంచిది" అంది.

"మాట...." అంటున్నాను, ఫోను పెట్టేసింది.

వారం రోజులపాటు లలితను కలవాలని ప్రయత్నం చేశాను కాని వీలు కలగనీయలేదు.

రెండు రోజుల తర్వాత లలితకు నాగరాజు  అనే అతనితో తిరుపతిలో పెళ్లి యిందని విన్నాను. తన పెళ్లయిన ఆరు నెలల తర్వాత నాకు ఫోను చేసి, "నా పెళ్లి అయింది" అంది.

"విన్నాను."

"నామీద కోపంగా ఉందా?"

"భలేదానివి,  నీమీద కోపం దేనికి?"

"ఆలస్యమయినా కంగ్రాచ్యులేషన్సో, గ్రీటింగ్సో చెప్పలేదు."

"నువ్వు నాకు పెళ్లి పత్రిక పంపించి ఉంటే , లేదూ ఫోనుచేసి నాతో ఒక్కమాట చెప్పి ఉన్నా కంగ్రాచ్యులేషన్స్ అనటంకాదు, మంచి గిఫ్ట్ ఇచ్చి ఉండే వాడిని. తప్పు నాదికాదు."

"తప్పు నాదే.... నిన్ను కలవాలని ఉంది. మీ ఆఫీసుకు రమ్మంటే వస్తాను."

"ఏమనుకోకు. నేను చాలా బిజీగా ఉన్నాను. పదిరోజుల వరకు కలవటానికి వీలుండదు."

"పోనీ, నాకోసహాయం చేసి పెట్టగలవా?"

"చెప్పు."

"నా భర్త శాడిస్టు. చీటికి మాటికి నన్ను కొడుతుంటాడు. హింసిస్తుంటాడు. నేనతనితో విసిగిపోయాను. రెండు రోజులకిందట సిగరెట్‌తో నా స్తనాలు, తొడలు కాల్చాడు.  అతన్ని ఎదిరించలేకపోతున్నాను.... నీకు పోలీసాఫీసర్లు తెలుసుకదా, వాళ్లకెవరికయినా చెప్పి ఈ శాడిస్టుకు బుద్ధి వచ్చేలా పాఠం చెప్పించలేవా?"

"పోలీసు కంప్లెయింట్ ఇవ్వొచ్చు కదా?" అని ఫోను పెట్టేశాను.

ఆ తర్వాత మళ్ళీ ఇవేళే నాకామె ఫోను చేయటం, రెస్టారెంటులో కలవటం.

మా భోజనాలు పూర్తయ్యేసరికి పదిదాటింది. లలిత ఐస్‌క్రీం తింటోంది. నేను కాఫీ తాగుతున్నాను. రాత్రి భోజనం చేశాక కాఫీ తాగటం నాకు అలవాటు.

"ఇప్పుడు నాకో సమస్య ఎదురయింది" అని ఆగింది. కప్పు చాటున నవ్వుకున్నాను. ఆమెకు సమస్యలు లేని దెప్పుడు? ఒక సమస్య తీరగానే మరొక సమస్య ఎదురవుతుంటుంది. ఈ సమస్యలతో బాగా అలవాటుపడి ఉండాలి.  ఏమిటన్నట్టు

చూశాను. "స్నేహితుడిగా ఈ సమస్య పరిష్కరిస్తావనే ఆశతో నిన్ను ఇక్కడకు పిలిచాను." అంది.

"చెప్పు" కప్పు సాసర్‌లో పెట్టి సిగరెట్ వెలిగించాను.

"మా ఆఫీసులో సుకుమార్ అనే కొలీగ్ ఉన్నాడు. అతనికి నా వయసుంటుంది. అతను మా ఆఫీసు కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ. నేను లేడీస్ రిప్రజెంటేటివ్‌ని. ఆయా కార్యక్రమాల్లో తరచూ కలుస్తూ ఉండటం వలన మా పరిచయం పెరిగి, స్నేహితులమయి సన్నిహితులమయ్యాం. అతనికి పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలున్నారు. కొద్దోగొప్పో డబ్బున్నవాడు. స్థానికంగా పలుకుబడి కూడా ఉంది. వారానికి కనీసం రెండు మూడు సార్లయినా కలుస్తుంటాం.... ఎక్కడో అయితే ఏగొడవా ఉండదు. సరాసరి మా ఇంటికి వచ్చేస్తుంటాడు. తన భార్యకు విడాకులివ్వకుండా ఇంకో ఇల్లు తీసుకుని నాతో కాపురం పెట్టాలనే ఉద్దేశంలో ఉన్నాడు. అదినాకు ఏమాత్రం ఇష్టంలేదు. అతను నా భర్తను మించిన శాడిస్టు. నాకు తనుకాక మరెవరయినా ఉంటే నన్ను చంపేస్తానని చాలా సార్లు అన్నాడు. నాతో స్నేహంగా ఉన్న ఇద్దరిని ఏదో నెపం మీద కొట్టటం కూడా జరిగింది. ఆఫీసులో అతనంటే చాలా మంది భయపడుతూ ఉంటారు. నేనూ భయపడుతుంటాను. అతనంటే విసిగిపోయాను. ఉద్యోగం వదిలేసి ఎక్కడికన్నా పారిపోదామని అనిపిస్తోంది. వెళ్లలేకపోతున్నాను.... అతన్నుంచి ఎలా తప్పించుకోవాలో నాకు అర్థంకావటంలేదు....'' చివరి మాటలు అంటున్నప్పుడు దుఃఖం ఆపుకోలేకపోయింది. తనచేతి రుమాలు అందుకుంటుంటే నా నవ్వు పెదవులు దాటింది.

"నేను బాధ పడుతొంటే నీకు సంతోషంగా ఉంది."

"అదేంకాదు.... ఏడుస్తున్నప్పుడు కూడా నువ్వు చక్కగా ఉంటావు."

ఏడుపు ఆపింది.

"అతనితో ఫ్రెండ్‌షిప్ చేసే ముందు అతని గురించి తెలుసుకుని ఉండవలసింది."

"అతనింత రోగ్ అని అనుకోలేదు. ఎవరూ అతని గురించి భయం చాతనో, ఏమో క్లియర్ పిక్చర్ ఇవ్వలేదు.... నీకు సిటీలో మంచి పలుకుబడి ఉంది. నువ్వు అనుకుంటే ఏ పనయినా చేయగలవు. చేయించగలవు. నీ పలుకుబడి ఉపయోగించి అతని బారి నుండి నన్ను తప్పించలేవా? నాకు సహాయం చేసి పెడితే నీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను...." కళ్ళల్లో నీరు తిరుగుతోంది. రెండు చేతులు జోడించింది.

చివరంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించాను.

స్టివార్డ్ నా దగ్గిరకు వచ్చి, "ఎక్స్‌క్యూజ్ మీ సార్. మీ పేరేమిటి?" అడిగాడు.

చెప్పాను.

"మీకు ఫోను" చేతిలో ఉన్న ఫోను నా ముందుంచాడు. రిసీవర్ చేతిలోకి తీసుకుని "హలో" అన్నాను.

"నమస్తే అన్నా. నా పేరు సుకుమార్. వినే వుంటావు. నువ్వేమనుకోనంటే జరంత సేపు ఫోను నీ ఎదురుగా కూర్చున్న లలితకిస్తావ్?"

రిసీవరు లలితకు అందిస్తూ, "ఫోను నీకే" అన్నాను.

"ఎవరు?"

"ఇంకెవరు, సుకుమార్."

"నేనిక్కడ ఉన్నట్టు అతనికెలా తెలుసు?"

"నువ్వు నాకు ఎక్కడి నుండి ఇవేళ ఇక్కడ కలుసుకుందామని ఫోను చేశావు?"

"మా ఆఫీసు నుండి."

"ఎవరో విని ఆ వార్త అతనికి చేరవేసి ఉంటారు."

లలిత రెండు నిమిషాలపాటు అతనితో మాట్లాడింది. అతనేం మాట్లాడి ఉంటాడో కందిపోయిన ఆమె ముఖం చూసి నేను ఊహించగలను. మాట్లాడటం ముగించాక రిసీవరు హుక్ మీద పెడుతున్నప్పుడు ఆమె చేయి వణకటం గమనించాను. బేరర్ వచ్చి ఫోను తీసుకు వెళ్ళిపోయాడు. ఐస్‌క్రీం సహించలేదేమో, పక్కన పెట్టేసింది.

పావుగంట తర్వాత ఇద్దరం కిందకు వచ్చి కారులో కూర్చున్నాం. హోటలు బయటకు వచ్చాక, "ఎక్కడ డ్రాప్ చేయమంటావు?" అడిగాను.

"మా ఇంటి దగ్గర " నెమ్మదిగా అంది.

అక్కడి నుండి వాళ్లల్లు ఇరవయి నిమిషాల ప్రయాణపు దూరంలో ఉంది. ట్రాఫిక్ ఎక్కువ ఉండదు. దారికూడా బావుంటుంది. చల్లటి గాలి వీస్తోంది.

"నాకు సహాయం చేసే విషయం నువ్వేమీ చెప్పలేదు" నిష్ఠూరంగా అంది.

"వెల్" గొంతు సవరించుకున్నాను.

"నాకు సహాయం చేయటం ఇష్టం లేకపోతే చెప్పేసేయి. నేనేమీ అనుకోను."

"ఏవిధంగా చేయాలో అని ఆలోచిస్తున్నాను."

"ఒక్క విషయం చెప్పు. నేనంటే నువ్వింకా ఇష్టపడుతున్నావా?"

నవ్వి, "నిజం చెప్పమంటావా, అబద్ధం చెప్పమంటావా?" అడిగాను.

"నా జీవితం నవ్వులాట అయింది."

"నీ చేతులారా చేసుకుందని నువ్వెందుకు అనుకోవు?"

ఏదో అనబోయింది కాని అనలేదు.

"ఒకప్పుడు నువ్వంటే నేను చాలా ఇష్టపడేవాడిని. ఇప్పుడు లేదు. భ్రమలో పడి జీవితంలో చాలా కోల్పోయాను. ఇటుకమీద ఇటుక పేర్చుకుంటూ నా జీవితాన్ని తిరిగి నిర్మించుకోటానికి చాలా కష్టపడ్డాను. నా పొరపాట్లకు నేను ఎవరినీ తప్పు పట్టను. చేసిన పొరపాటును మళ్లీ చేయదల్చుకోలేదు.

"నా సహాయం గురించి అడిగావు. నీ సమస్య జటిలమయినదేమీ కాదు. ఎటువంటి సమస్యనయినా పరిష్కరించుకునే ధైర్యం నీకు లేదని నేను అనుకోను. ఒకరి సహాయం నీకు అవసరమవుతుందని కూడా అనుకోను. కాకపోతే, నువ్వు మెసూకిష్టవి అయిపోయినట్లు నాకు అనిపిస్తోంది. జీవితం ఎంతో అందమయినది. సరిదిద్దుకోవటం మన చేతుల్లోనే ఉంటుంది. ఎవరూ ఏమీ చేయరు." అన్నాను.

కారు లలిత వాళ్లింటికి కొద్దిదూరంలో ఆపి తలుపు తెరిచాను. వీధి దీపం ఉండుండి వెలుగుతోంది. నా మాటలు రుచించాయో లేదో తెలుసుకోవటం నాకు ఇష్టంగా లేదు. ఆమె కారు దిగి చెట్టుకింద చీకట్లో నిలబడింది. పరీక్షగా చూస్తే తప్ప అక్కడ ఎవరో ఉన్నారని తెలియదు. కారు వెనక్కి తిప్పాను.

ఆ తర్వాత లలిత ఏమయిందో నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా అనిపించలేదు.

◆ ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 29 ఆగస్ట్ 1996